
ఈ వారం తెలుగు పుస్తకం

# జీవిత విలువలను ఆవిష్కరించిన

# జలంధర కథలు

■ కాత్యాయని విద్మహే



**Author:** Jalandhara
**Subject:** SHORT STORIES
**Year of Publication:** 2003
**Price:** USD $ 2.31

ఏ రచయితదైనా అప్పుడొక కథ అప్పుడొక కథ చదివితే కలిగే అనుభవం వేరు. అది ఖండ ఖండాలుగా వుంటుంది. రచయిత మనకు పూర్తిగా తెలిసినట్లు అనిపించదు. ఆ రచయితవే అనేక కథలు ఒక్కసారి ఏకబిగిన చదివితే కలిగే అనుభవం అఖండంగా ఉంటుంది. పరిమాణం గుణంగా మారి రచయిత ఆంతర్యాన్ని ఆవిష్కరిస్తుంది. రచయితతో ఒక సాన్నిహిత్యాన్ని ఏర్పరుస్తుంది. *జలంధర కథలు* చదివితే కలిగే అనుభవం ఇది.

జలంధర తొలి కథా సంపుటిని ముప్పై ఒక్క కథలతో 2004 లో *విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్* వారు ప్రచురించారు. 1969 నుండి 2002 మధ్యకాలంలో వచ్చిన కథలివి. హరిత విప్లవం దగ్గర నుండి ప్రారంభించి సామాజిక రాజకీయ ఆర్థిక విప్లవోద్యమాలు, గుర్తింపు ఉద్యమాలు - స్త్రీల ఉద్యమాలు, దళిత ఉద్యమాలు, ప్రాంతీయ ఉద్యమాలు - ఎన్నో వికసించి విస్తరించిన కాలం ఇది. ప్రపంచీకరణ క్రమం ఊపందుకుంటూ కార్పొరేట్ సంస్కృతి వ్యాపిస్తున్న కాలం కూడా ఇది.

అయితే జలంధర కథలకు వీటితో ప్రత్యక్ష సంబంధం లేదు. అంటే అవి ప్రత్యక్షంగా జలంధర కథా వస్తువు కాలేదు. కానీ వాటి ఫలితంగా జీవన కాంక్షలలో, విలువలలో వస్తున్న మార్పులు. అవి జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న తీరు, మనుషుల మధ్య సంబంధాలలోని సామనస్యాన్ని, సాహార్ధతను దెబ్బ తీస్తున్న విధానం జలంధర కథలకు వస్తువైనాయి. ఈ మార్పులు, విధానాలు మనిషి జీవితంలో సృష్టిస్తున్న విషాదాన్ని ఆమె గుర్తించారు. విషాదానికి కారణాలను అన్వేషించటం, ఆ కారణాలను ధ్వంసించే నైపుణ్యం జనం అలవరచుకోవాలని ఆశించటం, మనిషికి సుఖమైనది ఏదో సూచిస్తూ సుఖమన్నది ఎవరికి వారే సాధించుకొనవలసినదని, అందుకు ఎన్నుకునే మార్గాలూ ఎవరికి వారే నిర్ణయించుకొనవలసినవి చెప్పటం - జలంధర కథల లక్షణం.

## I

మనిషి జీవితంలో విషాదానికి కారణం తనకు ఏమి కావాలో తనకు తెలియకపోవడం. తనను తాను గౌరవించుకొనలేక పోవటం, జీవితాన్ని ప్రేమించలేకపోవటం, సంఘజీవితం, కుటుంబ జీవితం అనే పేరు

మీద ఒకళ్ళ జీవితాల మీద మరొకరికి అధికారాలు, అజమాయిషీలు సహజం చేసిన పరిస్థితుల ఒత్తిడి నుండి ఈ కారణాలు పుడుతున్నాయని జలంధర కథలు చెప్పాయి. ఈ ప్రతికూల పరిస్థితులు మనిషి సహజ వికాసానికి, సహజ ప్రవృత్తికి అవరోధాలై వికృతిని సృష్టిస్తున్నాయి. దీనిని తెలుసుకొనటం విషాదం నుండి విముక్తికి మొదటి మెట్టు. ఆ వైపుకు మనిషిని నడిపించటం జలంధర కథలు చేసిన పని.

'తులసిమొక్క' కథలో భార్గవిని గురించి 'ఆమెను ఆమె గౌరవించుకునే గొప్ప శక్తి ఆమె దగ్గర ఉంది ' అంటారు జలంధర. భార్గవి తాను చదువుకొని ఉద్యోగం సంపాందించి తన వాళ్ళందరి బాగుకోసం ఖర్చుపెట్టటంలో తనను తాను గౌరవించుకునే గొప్ప శక్తిని పొందిదన్న మాట. 'మజిలీ' కథలో విఫలమైన దాంపత్య సంబంధం వల్ల కలిగిన వేదనతో లోకంలో మామూలు స్త్రీలాగా సమాజ సానుభూతిని ఆశిస్తూ ఏడ్చి గోల చేసే మనస్తత్వం కాక భర్తను ఏమీ అనలేక, ఎవర్నీ ఏమీ చేయలేక తనను తాను హింసించుకుంటూ, తనమీద తానే సానుభూతి చూపించుకుంటూ వున్న వరూధినికి రైల్లో తోటి ప్రయాణికుడు 'మిమ్మల్ని మీరు ప్రేమించుకోవటం నేర్చుకోండి ముందు' అని చేసిన ఉపదేశం, తారక మంత్రం, తరుణోపాయం అయి ఆమెను నడిపించింది. 'సాలభంజిక' కథలో శారదకు రాజశేఖరం చెప్పంది ఆత్మాభిమానంతో తలెత్తుకొని నిలబడమనే. ఆత్మాభిమానం తనను తాను, గౌరవించుకొనటానికి, ప్రేమించుకొనటానికి ప్రాథమికంగా వుండవలసిన లక్షణం.

తనకు ఏది కావాలో తెలిసిన మనిషికి తనను తాను గౌరవించుకొనటం ప్రేమించటం తెలిసిన మనిషికి ఇతరుల కోసం జీవించటం, ఇతరుల ఆనందం కోసం తాను చేయగలిగింది చేయటం, ఇతరులలో చలన చైతన్యాలను గుర్తించి ప్రవర్తించటం తెలుస్తుంది. 'సాలభంజిక'లో రాజశేఖరం, 'సహాయం'లో సిద్ధార్థ, 'మహోత్సవం'లో కృష్ణన్ నాయర్ అటువంటి వారే. వాళ్ళు ముగ్గురూ మనుషుల కోసం నిలబడ్డ వాళ్ళు. మనుషులకు గౌరవనీయమైన బ్రతుకును ఆశించినవాళ్ళు. తమకు చేతనయిన పరిధులలో అటువంటి బ్రతుకును మనుషులు సమకూర్చుకొనటానికి చేదోడు వాదోడు అయినవాళ్ళు.

మనిషి జీవితంలో విషాదానికి మరో ముఖ్యకారణం 'డబ్బు' అని జలంధర కథలు స్పష్టం చేస్తాయి. డబ్బు లేక పోవటం కొందరి జీవితాలలో విషాదానికి కారణమైతే డబ్బే కొందరి జీవితాలలో విషాదానికి కారణమవుతుంది. డబ్బు లేకపోవటం వల్ల ఆడ పిల్లలు తగిన కట్నమిచ్చి కోరిన వరుడుని పొందలేరు.ప్రేమించిన వాడిని పొందలేరు. అది వాళ్ళ జీవితంలో నిశ్శబ్ద విషాదాన్ని నింపుతుంది. 'కానుక' కథలో సీతాదేవి, 'తులసిమొక్క'లో భార్గవి ఆ రకంగా కట్నం ఇయ్యలేకనే జీవితకాలపు అవివాహితలు గా మిగిలిపోయారు. డబ్బు లేదన్న కారణంగా తాము తిరస్కరించబడటం వాళ్ళు లోలోపల దాచుకున్న విషాదం. 'గడ్డిపూలు' కథలో శకుంతల తన వయసుకు అందానికి ఎక్కడా తూగని రెండవ పెళ్ళి మనిషిని భర్తగా అంగీకరించటానికి, అనుమానాల మధ్య అంతులేని హింస మధ్య జీవితం గడపాల్సిన విషాద స్థితికి డబ్బులేక పోవటమే కారణం. డబ్బే కాదు, కులం లేకపోవటం కూడా జీవితంలో విషాదానికి కారణమవుతుందని 'సాలభంజిక' కథలో శారద జీవితం చెప్తుంది.

డబ్బు లేకపోతే విషాదమే కానీ, డబ్బుండటం విషాదమెలా అవుతుంది? - అంటే డబ్బు మనిషిలో వున్న సర్వ సద్గుణాలను నాశనం చేస్తుంది కనుక. తనను తను ప్రేమించి గౌరవించు కోగలిగిన శక్తి వున్న వ్యక్తి తనను

తాను పెంచుకుంటూ పోవటం జరుగుతుందని 'రక్షమైథిలి'కథలో మైథిలి విషయంగా సూచించారు జలంధర. అదేవిధంగా డబ్బును ప్రేమించే వ్యక్తి డబ్బును పెంచుకుంటూ పోవటం అనివార్యం. ఆ డబ్బు వ్యామోహంలో మనుషులు, మనుషుల కన్నీళ్ళు, అవసరాలు ఏవీ గుర్తు పట్టలేని దృష్టి మాంద్యం వస్తుంది. 'కులం కాని దాన్ని తీసుకొస్తే అమ్మ ఉరేసుకుని చచ్చిపోతానంటున్నది' అని నెపం పెట్టి ప్రేమించిన శారదను వదిలి అయిదు లక్షల కట్నపు పెళ్ళి చేసుకున్న సుధాకర్ మీద ఇంకా ఏ మూలనో వున్న స్నేహలక్షణం వల్ల తన కష్టకాలంలో ఆదుకొంటాడేమోనని వచ్చింది శారద. భర్తే ఆమె సమస్య. భర్త నుండి దూరంగా ఆత్మగౌరవంతో బ్రతకటానికి తన కొక చేయూత కావాలి. ఒకప్పటి ప్రేమికుడు స్నేహితుడుగా ఆ పాటి సహాయం తనకు చేయలేకపోతాడా అని వచ్చింది. భంగపడ్డది. "తన స్థితిని గమనించనే లేదు. కన్నీళ్ళేమిటి శారదా అని అడగలేదు. కంట్లో ఏదో పడ్డట్లుంది తుడుచుకో అన్నాడు. పెద్ద ఆఫీసర్ రాంక్‌లో వున్న తన భర్త హోదా గురించీ ప్రమోషన్ గురించీ అడిగాడు. ఇళ్ళు, వాకిళ్ళు, ఆస్తులు, అంతస్థులు - వీటి గురించే మాట్లాడాడు. సుఖంగా ఉన్నావా శారదా అని అడగలేదు" సానుభూతిని పంచని సుధాకర్ ప్రవర్తన గురించి శారద లోలోపలి ఆలోచనలు, అంచనాలు ఇవి. శారద తన నుండి ఏమి ఆశిస్తున్నదో దానిని పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు అతను. మనిషి కన్నీటిని గుర్తించలేని వాడు, గుర్తించినా పట్టనట్లు ప్రవర్తించే వాడు మనిషితనం నుండి పరాయీకరించబడ్డట్లే.

ఆత్మవిమర్శతో విషాదానికి మూలకారణాలలో తానూ భాగమే అన్న స్పృహ కలిగినప్పుడు తనను తాను సవరించుకొనటానికి ప్రయత్నం ప్రారంభమవుతుంది. అది క్రమంగా ఎవరి తప్పులు వాళ్ళు తెలుసుకొని మొత్తంమీద అందరూ ఒక ఉత్తమ జీవిత సంస్కృతిని నిర్మించటానికి దోహద పడుతుంది. 'రక్షమైథిలి' కథ ఇందుకు మంచి నిదర్శనం.

మైథిలి ఉద్యోగం చేస్తూ ఉద్యోగం పోగొట్టుకొని తాగుడుకు అలవాటు పడిన భర్తను, పిల్లలను పోషంచటమే గాక నిరంతరం అతని హింసకు గురవుతుంటుంది.ఆ భర్త, భర్త పెట్టే కష్టాలు ఇవే ఆమె లోకంతో పంచుకునే విషయాలు. ఆమె ప్రపంచానికి అతను కేంద్రబిందువు. అతను తప్ప మిగతా ప్రపంచం లేదా అని తనతో పాటు పనిచేసే విరించి వేసిన ప్రశ్న ఆమెను తనలోకి తాను చూచుకునేటట్లు చేస్తుంది. అలవాటైన బానిసత్వంలో చిక్కుకుని మరొకరకంగా బతకటం గురించి ఆలోచనే లేని స్త్రీల జీవిత విషాదానికి ప్రతీక మైథిలి. ఆ బానిసత్వం నుండి బయట పడటానికి ప్రయ్నత్నపరురాలయ్యే క్రమంలో భర్తను, కుటుంబాన్ని మించిన సామాజిక రాజకీయ ప్రపంచంలోకి విస్తరిస్తుంది. ఇంట్లో ఆర్గ్యుమెంట్లు మానేయ్యటం ద్వారా అతనిని రెచ్చగొట్టటం తగ్గించింది. ఆ రకంగా తనవైపు నుండి ఒక సంయమం, ఒక సర్దుబాటు - ప్రదర్శిస్తే దుఃఖం చాలావరకు తీరి, ఒక సుఖం అనుభవం లోకి వచ్చే అవకాశం వుందని జలంధర 'రక్షమైథిలి' కథలోనే కాదు, 'పూర్ణిమ' కథ లోనూ నిరూపించారు.

భౌతికంగా మనిషి సమన్వయాన్ని సాధించడానికి మంచి భావన అవసరం అంటారు జలంధర. 'నిర్మోహదర్పణం' కథలో ఒక కథకు ముగింపుగా ఒక పాత్ర చేత వ్రాయించిన "మనిషి భావనాబలం చాలా బలవత్తర మైనప్పుడు, చుట్టూ పంచభూతాత్మకమైన వాతావరణం యొక్క రాపిడిని వత్తిడిని జయించి, దాని లయతో లయించినప్పుడు చుట్టూ పరిస్థితిని మార్చుకోగలదు. కొంచెం ఎదిగితే ఈ భావనను అనుభవించవచ్చు. ఎదుటివారితో పంచుకోవచ్చు. "అనే మాటలు జలంధర ఆదర్శమే. 'యద్భావం తద్భవతి' వేదాంత సారం

జీవితంలో అభ్యాసం చేస్తే విషాదం నుండి విముక్తి సాధ్యమవుతుందని జలంధర బావం. స్వార్థం, నాది అన్న మమత్వం వదులుకొనటం సామాన్య విషయాలు కావు. దానికి చాలా సాధన కావాలి. ఆ సాధనలో వున్నవాళ్ళు సమస్యకు పరిష్కారం కనుక్కోగలుగుతారు. సంసారం మధ్య వుంటూనే నిర్మోహంగా నిష్కామ కర్మ చేయగలుగుతారు. అది 'పూర్ణిమ' వంటి కథలలో అంతస్సూత్రమే అయినా ప్రత్యేకంగా దానిని నిరూపించటం కోసమే 'నిర్మోహదర్పణం', 'మలుపు' వంటి కథలు వ్రాశారు.

జీవితంలో ఆశించింది పొందే పరిస్థితి లేకపోవటం,అందకపోవటం విషాదానికి కారణాలు. ఈ విషాదంలో మనిషి కూరుకు పోవటమేనా చేయవలసింది, అంటే జలంధర కథలు కాదని సమాధానం ఇస్తాయి. పొందటం భౌతికస్థితి. అది సాధ్యం కానప్పుడు భావనలో దానిని పొంది తృప్తి పడవచ్చు. భౌతిక జీవితాన్ని పెద్దగా ఇబ్బందులు పడకుండా గడపవచ్చు. ఇది చెప్పటానికి వ్రాసిన కథలు 'మహాగాయని', 'సన్నిధి'.

ఒక గాయనికి వాస్తవ జీవితంలో లభించిన భర్త ఏ మాత్రం భావుకత లేని డబ్బు మనిషి. ఆమె పాట అతనికి సంపాదనా మార్గం. ఆమె పాటతో అతనికెటువంటి మమత్వం, అనుబంధం లేదు. ఆమెలో పాడే శక్తిని గుర్తించిన వాడు గౌరవించిన వాడు మరొకడు. అతనితో జీవితానికి ఆమెకు అవకాశం లేదు. సంఘంలో అతను వేరొక స్త్రీకి, కుటుంబానికి బాధ్యుడు. ఈమె వేరొక కుటుంబానికి బాధ్యురాలు. అయితే అతనిని తన భావనలో నిలుపుకొని అతని దగ్గర అతని కోసమే పాడుతున్న ఒక సుందరమైన అనుభూతి స్థితిని సాధన ద్వారా పొందుతూ ఆమె తనకు పూర్తిగా వ్యతిరేకమైన వాతావరణంలో కూడా పాటలో సృజనాత్మకతను, సౌందర్యాన్ని కాపాడుకొంటూ వచ్చింది. అతను మరణించాక అతను లేడు అన్న ఆలోచన కమ్ముకుంటే అతడి సమక్షంలో అతని కోసం పాడుతున్నట్లుగా అనుభూతిని పొందలేక పోతున్నది. ఆ పరిమితిని తద్వారా కలిగే దుఃఖాన్ని అధిగమించటానికి ఆమె ఎన్నుకున్న మార్గం అతని గురించిన భావనను తనగుండె నుండి ప్రపంచానికి విస్తరింప చేయటం, అతని కుటుంబానికి అలాంటి వాళ్ళు అనేకమందికి సహాయం చేసే సంస్థలు స్థాపించటం ద్వారా దానినామె సాధించగలిగింది. వాటన్నిటి రూపంలో వున్న అతని కోసమే పాడగలిగే స్థితిని తిరిగి ఆమె పొందింది. తద్వారా విజేత అయింది.

బాల్య స్నేహంలో తనను ప్రభావితం చేసి తన మీద ఒక ముద్ర వేసి అది తాను గుర్తించక ముందే ఆమె మరొకరి భార్య అయి, గుర్తించట్లే తాను మరొకరికి భర్త అయి జీవన యానం సాగిస్తూ కూడా అంతరంగంలో ఆమె గురించి భావనను నిరంతరం నిలుపుకొంటూ ఆమె సన్నిధినే అనుభవించాడు రామకృష్ణ. దానికి మృత్యువు కూడా అవరోధం కాలేదు. ఆమె మరణించాక - బహుశా ఆమె మరణించింది కార్తీకపౌర్ణమి అయివుంటుంది- ప్రతి పౌర్ణమికి ఉపవాసం ఉండటం ద్వారా , ప్రతి కార్తీక పౌర్ణమికి ఆమెను మట్టి చేసినూరికి వెళ్ళి రావటం ద్వారా అతను ఆ సన్నిధిని నిత్యం అనుభవిస్తూనే వుంటాడు. అసంతృప్తులను దరి చేరనీయనిది, అన్ని అసంతృప్తులకు సమాధానం భావన ద్వారా సాధించే సమన్వయం.

మనిషి చేసే మంచి భావన ఆ మనిషికి మేలు చేసేది సుఖాన్ని ఇచ్చేది మాత్రమే కాదు. ఎదుటివారికి ఆ మేలును సుఖాన్ని పంచేది కూడా, 'ఉపాసన' కథ దాన్నే సూచిస్తుంది. ఆర్థిక సామాజిక కౌటుంబిక వ్యక్తిగత సమస్యలకు సంఘర్షణలకు ఒక పరిష్కరంగా మనస్సు చేసే సంకల్పాన్ని, మెదడు చేసే భావనను కలిపి ఒక విలువగా ప్రవేశపెట్టటం జలంధర కథలలో కనిపిస్తుంది. జీవితంలో మనసు పాత్ర, భావన పాత్ర తక్కువేమీ కాదు - జీవితాన్ని

క్రియాశీలం, చైతన్యవంతం చేసినంత వరకు. కానీ అవి బాధితులు పరిస్థితులతో రాజీపడి తమలోని ఆ కాస్త జీవ చైతన్యాన్ని ఉపహరించుకొని యథాతథస్థితి కొనసాగింపుకు దోహదం చేసే విధంగా తమను తాము మలుచుకోనే ఆత్మవంచనా ప్రక్రియకు ఉపకరించేవిగా తయారవుతాయేమోనన్న సందేహం 'పూర్ణిమ' లాంటి కథల విషయంలో కలగక మానదు.

II

కష్టాల నుండి, జీవన విషాదాల నుండి విముక్తికి ఆశ్రయించదగినది భక్తి మార్గమన్న నమ్మకం ఒకటి వున్నది. దీనిని సీరియస్‌గానే చర్చకు పెట్టాయి జలంధర కథలు. భక్తి ఒక తాత్విక జీవన విధానంగా వ్యక్తమయితే జలంధరకు ఇష్టం. అది కేవలం ఆచార క్రియాకలాపంగా వుంటే భరించలేరు. అది వ్యక్తి వికాసానికి కాక ఒక అధికార వ్యవస్థగా ఉంటే అసలే సహించలేరు. కానీ సాధారణంగా భక్తికి అభివ్యక్త రూపం అధికారం. దేవుడి పేరు చెప్పి ఏ భౌతిక ప్రయోజనాల కోసమో కొందరిని మరికొందరికి ఒదిగి ఉండేట్లు నియంత్రించడం జరుగుతూనే ఉంటుంది. భగవంతుడి పేరుతో గుడి, చర్చి, మసీదు ఏవైనా మనిషి మీద, మనిషి ఆత్మ స్వతంత్రత మీద జులుం చలాయిస్తుంటాయి. అటువంటి వ్యవస్థ పట్ల జుగుప్సను భార్గవ ముఖంగా 'శరణు ఘోష' కథలో వ్యక్తం చేశారు జలంధర.

భక్తితో పాటు కలిపి వాడబడే భావన భయం. 'భయభక్తులు' పేదవర్గాలకు, అణచివేయబడుతున్న వర్గాలకు అత్యవసర గుణాలు. భయం అధికారాన్ని ప్రశ్నించకుండా అణకువతో బ్రతకటానికి, భక్తి అధీనతను స్వచ్ఛందంగా స్వీకరించి ఎటువంటి ఫిర్యాదు, అసంతృప్తి లేకుండా లొంగి జీవించటానికి అవసరం. అందుకనే ఉన్నతవర్గాలెప్పుడూ క్రింది వర్గాలను భయభక్తులతో బ్రతకమని హెచ్చరిస్తుంటాయి. అవి లేవని అసంతృప్తి ప్రకటిస్తాయి. అవసరమనుకొంటే భయభక్తులను మప్పటానికి శిక్షకైనా వెనకాడవు. 'స్థితప్రజ్ఞత' కథలో యజమానురాలు ఈ వర్గానికి చెందిన మనిషే. దేవుడంటే భయం చూపని సుబ్బారావును ఆమె సహించలేదు. తాను చేసే వ్రతాలు, నోములు అతను నిర్లక్ష్యంగా చూడటం ఆమెకు అధికార ధిక్కారంగానే కనబడుతుంది. అందుకనే ఏదో నెపంతో అతనిమీద అరిచి తన ఆధిక్యతను నిరూపించుకొన్నది. రాతి బొమ్మలో దేముడిని వెతుక్కునే పై వర్గాల భావ దారిద్ర్యాన్ని, ఆధ్యాత్మిక దారిద్ర్యాన్ని ధిక్కరించ కలిగింది శ్రామిక వర్గమే. రమణమ్మ ద్వారా యజమానురాలి స్థితిపై జలంధర 'స్థితప్రజ్ఞత' కథలో చేయించిన వ్యాఖ్యానం దానిని సూచించేదే.

భక్తి అంటే భగవంతుడి యందు సర్వ సమర్పణ భావం. అది లౌకిక ఆధిక్యతలు అంటని ప్రాంతం. కానీ దేవాలయంలో చేయించే అర్చన దగ్గర నుండి అన్నింటా ప్రతివాళ్ళు మిగతా వాళ్ళ కంటూ తమ ఆధిక్యతను నిలబెట్టుకునే ప్రయత్నం చేయటం పై 'గడ్డిపూలు'కథలో విమర్శ కనబడుతుంది. భక్తి హద్దులు దాటినప్పుడు ఇగో విజృంభించటాన్ని గురించి 'శరణుఘోష' కథలో ప్రస్తావించారు. స్వార్థాన్ని మరచిపోలేనప్పుడు ఎంత భక్తి ఉన్నా అది తనను తాను సమాజానికి ఆమోదయోగ్యమైన రీతిలో వ్యక్తీకరించు కొనటమే కానీ తనను లోపల నుండి వెలిగించేది కాకుండా పోతుంది. 'శరణుఘోష'లో భర్గవ దాదాపు ఇలాంటి అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మాట్లాడుతాడు. 'వేటినీ వాటిగా పొందే' అదృష్టం, దేనిని దానిగా చూడగలిగిన దృష్టిలేని సమాజంలో మనిషిని ఒక ప్రత్యేక సందర్భంలోనైనా మంచికి మళ్ళించటానికి మతం కారణమైతే అది ఆమోదయోగ్యమే అవుతుంది. అయితే ఇది తాత్కాలిక ప్రయోజనమే. స్వార్థం, ఆశ డిమాండ్ చేసిన మంచి

అది. ఆ మాత్రం సంస్కారం ప్రదర్శించాలన్నా మతం ఆలంబన కావటాన్ని మించిన దౌర్జన్యం లేదు. ఏదో లాభిస్తుందని భక్తిని ఆవాహన చేసుకొన్న వాళ్ళు ప్రయోజనాలు తీరితే దానినంత తేలికగానూ వదిలించుకోగలరు. ఆ స్పృహ జలంధరకు వుంది కనుకనే దేనిని దానిగా చూడగల కనువిప్పు నా దేశ ప్రజలకు కలిగే రోజు కోసం ఎదురుచూస్తానని 'నల్లబట్టలు' అన్న కథలో కోడలి చేత చెప్పించారు. మనిషిని నిజంగా కష్టాల నుండి విముక్తం చేయగలిగింది ఇలాంటి భక్తి కాదు. జీవన సంస్కారంలో భాగమైన భక్తి సాకార సగుణోపాసనను మించిన వైదిక జ్ఞాన తత్త్వం. 'ఉపాసన' కథ దానినే సూచించింది.

స్త్రీల సమస్యల విషయంలో జలంధర కథలు ఇచ్చిన, సూచించిన పరిష్కారాలు అన్నీ అందరికీ ఆమోదయోగ్యం కాకాపోవచ్చు కానీ జలంధర కథలు స్త్రీలను బహుకోణాల నుండి నిశితంగా పరిశీలించిన పరిణతి నుండి వచ్చిన జీవిత వ్యాఖ్యానాలు అనటంలో అభిప్రాయం భేదం వుండదు. స్త్రీల జీవితం పెళ్ళితో, కుటుంబంతో ముడిపడి ఉన్న లోక వాస్తవాన్ని, అందులోని హింసను, అది స్త్రీలో తెచ్చే మార్పును, స్త్రీల అంతరంగాలలో కలిగించే అలజడులను, ఆందోళనలను జలంధర చక్కగా పట్టుకోగలిగారు. జలంధర కథలలో పెళ్ళి గురించి, కుటుంబం గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించి స్త్రీల ప్రవృత్తుల గురించి ప్రస్తావనా వశంగా చేసిన వ్యాఖ్యానాలు ఒక దగ్గరికి చేర్చి చూస్తే జలంధర దృక్పథం స్పష్టమవుతుంది.

పెళ్ళంటే ఈ సమాజంలో పెళ్ళి ద్వారా జీవన సహచరులు కావలసిన స్త్రీ పురుషులు కాదు ముఖ్యం. బంగారం, కారు, సామాను మొదలైన వాటిని సమకూర్చే ఒక సందర్భం. అటువారి డబ్బుకు, ఇటువారి డబ్బుకు సంబంధం కలపటం. 'కానుక' కథలో రాజీ తల్లి తన తమ్ముడికి, డాక్టరుచదువుతున్న తమ్ముడికి తన కూతురిని ఇచ్చి పెళ్ళి చేయాలని అనుకుని పెళ్ళి కోసం సరుకూ సరంజామా సమీకరించటం పైనే దృష్టి పెట్టింది కానీ తమ్ముడి మనోభావాలకు, స్థాయికి రాజీని సరితూగేట్లు పెంచలేకపోయిందన్న ఆరోపణ ఆ కథలో చేశారు జలంధర. తమ్ముడు తన కూతురిని కాదని వేరే పెళ్ళి చేసుకున్నప్పుడు కూతురికి రాజాలాంటి సంబంధం తెస్తాను అని ఆవిడ చేసిన శపథానికి అర్థం లక్షలు ఆర్జించిన వాళ్ళ సంబంధం తేవటం. రూపం, గుణం వీటిల్లో వేటితోనూ సంబంధం లేని పెళ్ళిళ్ళివి. పెళ్ళిళ్ళలో ఐశ్వర్యాల స్థాయి చూస్తారు కానీ మానసికమైన సాయి గురించి ఆలోచించకపోవటమే దాంపత్యాల వైఫల్యాలకి కారణమని 'అగ్నిపుష్పం' కథలో సూచించారు జలంధర.

ఇదే విషయాన్ని 'స్నేహ' కథలో స్నేహ చేత మరింత స్పష్టంగా చెప్పించారు జలంధర. "ఒక మొగ మనిషి, మరొక ఆడ మనిషి పొరపాటునో బలవంతానో పెళ్ళి అనే లైసెన్స్‌తో శారీరకంగా ఒకటైనప్పుడు ఫిజికల్ ప్లేన్‌లో మామూలు ప్రపంచం దృష్ట్యా దగ్గరైనా, కేవలం క్షణికావేశం వాళ్ళను దగ్గకు తీసుకు వస్తుంది కానీ అది శాశ్వతం కాదు. గొప్పదీ కాదు.

'ఉప్పెన' కథలో శ్రీదేవిదయినా, 'తేజస్విని' కథలో మీనాదయినా డబ్బుకు డబ్బుకు హోదాకు హోదాకు మధ్య జరిగిన పెళ్ళే. ఫారిన్ డాక్టరు భర్త అవుతున్నాడని సంతోషించిన శ్రీదేవి షాంపెయిన్ మత్తులో తనవంకయినా తలెత్తి చూడని, స్నేహితులతో వ్యవహారాలు నడిపే భర్త కొరకు తొలిరేయి నుండే ఎదురు చూపులు చూడవలసి

వచ్చింది. ఇక ఆమె బ్రతుకంతా అతనితో ఏ సాన్నిహిత్యమూ లేని క్షణకాల మోహంగానో, జీవితకాలపు నిరీక్షణ గానో సాగవలసిందే తప్ప మరొక గత్యంతరం లేదు. "పెళ్ళికి కావలసింది ప్రస్తుత కాలంలో స్టేటస్" అని ఒదినగారు చేసిన హితబోధ, స్టేటస్‌కు అలవాటు పడిన మనో ప్రవృత్తులు కలసి 'తేజస్విని' కథలో మీనాను పెద్దలు కుదిర్చిన సంబంధం ఒప్పుకునేట్లు చేశాయి. ఆ పెళ్ళి ఒక స్త్రీకి ఒక పురుషుడికి కాదు అన్న విషయాన్ని "నాలుగు డిస్టిల్లరీలు , ఐదు ఫ్యాక్టరీలు ఒక పక్క రెండు ఫైవ్ స్టార్ హోటళ్ళు, నలభై ఎస్టేట్స్ మరొక పక్క" అన్న మాటలతో వ్యగ్యంగా సూచించారు జలంధర. మీనా ఆ పెళ్ళి కోసం 'దాదాపు మూడు నెలలు ఫ్లైట్ లో వెళ్ళి షాపింగ్‌లు చేసుకుంది" అని మాటలలో అతిశయోక్తి కనపడినా పెళ్ళిలో ఆలోచించవలసిన, తప్పని సరిగా వుండేట్లు చూచుకొనవలసిన స్త్రీ పురుషుల మానసిక స్థాయి సమ సంస్కృతి పూర్తిగా విస్మరించబడి ఆ స్థానంలో వస్తు చయం చేరిపోవటంలోని విషాదాన్ని ధ్వనిస్తుంది. ఒక పాపాయి పుట్టి కొంత అనుభవం గడించాక కానీ రోజూ డబ్బు కోసం తెరిచే బీరువా...ముద్దుగా..ఎత్తుగా.. మొరటుగా భర్తలా వుందని అర్థం కాలేదామెకు.

'వియద్గంగ', కథలో మందాకినికి కాశ్యప్ కు మధ్య సంభాషణలో పెళ్ళిళ్ళ గురించిన ప్రస్తావన వస్తుంది. పెళ్ళి అనే భావనకున్న గౌరవానికి, మనిషికి కావలసిన స్వేచ్ఛకు మధ్య ఏదో అగాధం వుందంటాడు కాశ్యప్. పెళ్ళి తద్వారా ఏర్పడే దంపతీ వ్యవస్థ గొప్పదే. అదొక ఉన్నతమైన ఆదర్శం. కానీ అదే సమయంలో మనిషి స్వేచ్ఛా లక్షణానికి పరిమితులను విధించే యంత్రాంగం గానిలో భాగం అయివుంది. కనుకనే వాస్తవ జీవితంలో ఆ వ్యవస్థా చట్రాన్ని అధిగమించటానికి ఏదో ఒక రకమైన ప్రయత్నాలు ఆది నుండి చరిత్రలో జరుగుతూనే ఉన్నాయి. వేశ్యావ్యవస్థ, వైవాహికేతర సంబంధాలు ఇవన్నీ తత్ఫలితాలే. వర్తమానంలో దాని స్థితి గురించిన అవగాహన మందాకినికి వుంది.

'సన్నిధి' కథలో రామకృష్ణ బాల్య స్నేహితురాలు "గోడ మీద వేళ్ళాడేసుకోవడానికి ఒక నలభై సంవత్సరాలకు సరిపడ క్యాలండరు కొనుక్కున్నట్లు కాదు పెళ్ళంటే" అంటుంది. తనకు ఏమి కావాలో, తను చేసుకోదలచిన పిల్లకు ఏం కావాలో తెలుసుకొని పెళ్ళికి ముందడుగు వేయమని మిత్రుడికి సలహా ఇస్తుంది. ఇలాంటి సలహా స్త్రీలు ఇయ్యటానికే ఎక్కువ అవకాశం ఉంది. వాళ్ళ అనుభవాలు అటువంటివి. ఈ కథలో రామకృష్ణ బాల్యస్నేహితురాలి పరిస్థితి కూడా అదే. హైస్కూలు చదువు పూర్తికాకుండానే పెళ్ళయి వెళ్ళిపోయింది. తనతో ఆడిన వాళ్ళు మగవాళ్ళు కావటం వలన చదువుకొంటూ ఇంకా బాల్యాన్ని అనుభవిస్తుంటే తాను సంసారపు బరువు బాధలు మోసే దశకు వచ్చింది. భర్తకు పరస్త్రీలతో సంబంధాలున్నాయి. అవి మనసుకు చేసిన గాయాలను మరుగు పరిచి నవ్వుతూ జీవించటం నేర్చుకుంది. పిల్లలు లేరని అత్తగారు కొడుకుకు మరోపెళ్ళి చేస్తానని బెదిరిస్తుంటే అభద్రత కలిగించిన బెంగను దిగమింగుకొంది. ఈ క్రమంలోనే దాంపత్యంలో లొసుగులు ఆమెకు అర్థమయ్యాయి. పెళ్ళంటే ఇద్దరు మనుషులు, ఎవరికి ఏది కావాలో పరస్పరం తెలుసుకుని ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకునే ఉత్తమ సంస్కారం - ఆ మనుషుల సంబంధంలో అభావం అవుతున్నది. రామకృష్ణ అయినా అటువంటి సంస్కారయుతమైన దాంపత్య జీవితాన్ని ఏర్పరచుకోనాలని స్నేహ ధర్మంగా హెచ్చరించింది. ఆలోచించమన్నది.

'ఆలోచిస్తూ కూర్చుంటే చాలా పెళ్ళిళ్ళు ముడి పడవు'అని లోకరీతిని వ్యాఖ్యానించినట్లుగా జలంధర అన్న వాక్యతాత్పర్యం పెళ్ళిళ్ళన్నీ అనాలోచిత చర్యలేనని తేల్చి చెప్తున్నది. పెళ్లి కొడుక్కి వృద్ధిలోకి వచ్చే అవకాశాలు, పెళ్ళి కూతురి వల్ల ఆర్థిక లాభాలు ఇవే రామకృష్ణ జానకి పెళ్ళి చేసుకొనటానికి నిర్ణయాంశాలు అయినాయని చెప్పటం ద్వారా జలంధర పెళ్ళిలో స్త్రీ పురుష సంబంధాలు ఆర్థిక సంబంధాలే అని చెప్పినట్లయింది. అవి ఎంత వ్యాపార సంబంధాలో 'సహాయం' కథలో చెప్పనే చెప్పారు. జ్యోత్స్న మామగారి బిజినెస్ లో ఆమె తండ్రి పార్టనర్. వాళ్ళ బిజినెస్‌లో షేర్లు పెట్టి, నగలు సారె సమకూర్చి కూతురికి ఆ పెళ్ళి చేసేసరికి ఆయనకు డెబ్బై అయిదు లక్షలు ఖర్చయింది. అదంతా అతని దృష్టిలో మాటలో కూడా 'పెట్టుబడే'. వ్యాపార సంబంధాల కోసం జరిగే పెళ్ళిళ్ళ తీరును కళ్ళముందు ప్రదర్శించింది 'సహాయం' కథ. ఉత్తర ధృవాలు దక్షిణ ధృవాలుగా వున్న మనుషులు చేసే సహజీవనాన్ని దాంపత్యం అనాలంటే కష్టమే. ముఖ పరిచయాలు, శరీర పరిచయాల స్థాయిని మించి వాళ్ళు ఒకరి హృదయాన్ని మరొకరు తాకలేరు. స్నేహ సహానుభూత జీవన సౌందర్యాన్ని కలసి పంచుకోలేరు. ఈ రకమైన దాంపత్యాన్ని "హక్కులున్న పరిచయస్థుల" కాపురం అంటారు జలంధర.

'సన్నిధి' కథలో జానికి రామకృష్ణకు పడకటింట్లో, వంటింట్లో, కార్లో, పిల్లల స్కూలు ఫంక్షన్స్ లో 'హక్కులున్న పరిచయస్థురాలు' గానే మిగిలిపోయిందని చెప్పిన జలంధర ఆ మాత్రం హక్కులు కూడా అనుభవించ లేకపోతున్న స్త్రీల జీవిత విషాదాన్ని 'పూర్ణిమ' వంటి కథలలో చిత్రించారు.

కుటుంబంలో అణచివేత, ప్రేమరాహిత్యం వల్ల ఏర్పడే ఊపిరాడనితనం కలిగే శారీరక మానసిక వికృతుల గురించిన అవగాహన జలంధర కథలలో కనబడుతుంది. 'సహాయం' కథలో జ్యోత్స్న తల్లి అనారోగ్యానికి కారణం అదే. ఆమెకు గర్భకోశంలో ఫైబ్రాయిడ్స్. ఉద్రేకాలు, అణచిపెట్టుకున్న ఆవేశాలు, దుఃఖాలు హార్మోన్స్ మీద, గర్భసంచీ మీద చూపించిన ప్రభావ ఫలితం ఆ రోగం. కుటుంబంలో స్త్రీ స్వేచ్ఛగా తనకు లోపల ఏది అనిపించిందో అది మాట్లాడగలిగిన స్థితి, తన కోపాన్ని ప్రకటించగల స్థితి లేకపోవటం - స్త్రీలలో అనారోగ్యాన్ని సృష్టిస్తున్నది. ఈ స్థితే మానసికంగా తానింకొక చోట అధికారం చేయటానికి కూడా కారణమవుతున్నది. కోడళ్ళ మీద అత్త అధికారం అయినా, స్త్రీల గయ్యాళితనమైనా ఈ కోణం నుండి అర్థం చేసుకొనవలసినవే. అత్తగారు తన మీద రెచ్చిపోవటాన్ని ఈ దృష్టి నుండి చూచినప్పుడు జ్యోత్స్న కు ఆమె మీద ద్వేషం పోయింది.

కుటుంబానికి స్త్రీ చేసే సేవ ఎంతయినా ఉంటుంది. కానీ, అది గుర్తింపుకు నోచుకోదు. ఇంట్లో ఉండి అన్నీ అమర్చి పెట్టి అందరి 'మూడ్స్' ను భరించే ఆడవాళ్ళది జీతం లేని సేవ, రిటైర్‌మెంటు లేని జీవితకాలపు సేవ అవుతున్నదని 'మహోత్సవం' కథలో చెప్పారు జలంధర. స్త్రీలు తమ స్వంత ఇష్టాలను అవసరాలను పూర్తిగా మరచిపోయి భర్త ఇష్టాలను, అవసరాలను, పిల్లల ఇష్టాలను అవసరాలను తమ ఇష్టాలు అవసరాలుగా మార్చుకుని జీవించే క్రమంలో మేధో సృజన శక్తులను ఎన్నిటినో కోల్పోతున్నారని ఈ కథ ద్వారా సూచించారు. వర్షిణి తల్లి పెళ్ళి కాకముందు అద్భుత సంగీత కళాకారిణి. పెళ్ళయ్యాక కుటుంబం ఆ శక్తులను పీల్చివేసింది. ఏ బాధ్యతలూ బరువులూ లేని, తానెవరికీ బరువు కాని జీవితం వృద్ధాప్యంలో ఓల్డ్ ఏజ్ హోమ్‌లో కానీ ఆమెకు లభించలేదు. అప్పుడు మళ్ళీ గొంతు విప్పి పాడుకోగలిగింది. కుటుంబం స్త్రీల జీవితంలోని సర్వ సృజనాత్మకతను కొల్లగొట్టగలిగిన వ్యవస్థగా వుండటంలోని విషాదాన్ని 'మహోత్సవం' కథలో వ్యక్తం చేశారు జలంధర.

మొత్తంమీద వివాహవ్యవస్థ రక్షణ కోసం ఏర్పడిందే కానీ పరిణతి చెందిన వ్యవస్థ కాదనే అభిప్రాయాన్ని

జలంధర 'మజిలీ' కథలో వరూధిని ముఖంగా వ్యక్తం చేశారు.'భర్త ఉన్నంత మాత్రం చేత ప్రతి కోరికా తీరిపోయి లేనంత మాత్రం చేత సర్వం పోయిందనుకునేటంత అద్భుతమైన ప్రేరణ అనుభవించటం లేదు అందరూ' అంటుంది వరూధిని. భర్తను వదిలేశాక ఒంటరిగా జీవించటం పెద్ద బాధగా లేకపోవటం అందువల్లనే 'గడ్డిపూలు' లో హారతి, 'వియద్గంగ'లో మందాకిని ఇలా అందరూ వరూధిని లాగానే వివాహవ్యవస్థ లో భర్తల నుండి విడిపోయాక కానీ, భర్తలు చనిపోయాక కానీ మళ్ళీ పెళ్ళి గురించి అనుకూలంగా ఆలోచించ లేకపోయారు.

## III

స్త్రీలు, పురుషులు వేరేవేరుగా తయారు చేయబడుతున్నారని అందుకు పెంపకం, కుటుంబ సంస్కృతి, సమాజ ధర్మం, సంప్రదాయ విలువలు కారణమవుతున్నాయని జలంధరకు తెలుసు. స్త్రీలు రెండవ స్థాయి పౌరులుగా చేయబడినంత మాత్రాన మొదటి స్థాయి గా పురుషులు పొందుతున్న ప్రయోజనాలు కూడా సర్వోత్కృష్టమైనవి అనుకోవటానికి వీల్లేదు అని భావిస్తారు. ఆడపిల్లలను రక్షిస్తున్నాం అన్న బాధ్యతతో వాళ్ళకు లోకమే తెలియకుండా చేసి, బ్రతికే పద్ధతే తెలియని అవిటితనం అలవాటు చేయటం, మొగపిల్లలను స్వతంత్రులుగా ఎదగనిస్తున్నాం అనుకొంటూ బాధ్యతల గురించి మోయవలసిన బరువుల గురించి గుర్తు చేస్తూ హెచ్చరిస్తూ బతుకు భయం కలిగించటం రెండూ సరియైనవి కావు ఆమె దృష్టిలో. ఈ పెంపకపు తీరు ఆడపిల్లను అసహాయురాలిగా మారిస్తే మగవాడిని క్రూరుడిగానో, అసమర్థ దుర్జనుడుగానో మారుస్తున్నది.

ఆడపిల్ల జీవితానికి ఏది కావాలో అది ఇవ్వలేని ప్రేమలు, ఆప్యాయతలకు అర్థం లేదంటారు జలంధర (కానుక). ఆడపిల్ల జీవితానికి కావలసినవి ఏవి? తనను తాను గుర్తించుకొనటం, తనకేం కావాలో తాను తెలుసుకొనగలగటం, తన రక్షణ తాను చూచుకొనగలగటం, తన వ్యక్తిత్వంతో నిర్ణాయక శక్తితో తన జీవితాన్ని తాను నిర్మించుకొనగలిగిన చైతన్యం - అవి కావాలి ఆడపిల్ల జీవితానికి. కానీ వాటి గురించిన స్పృహ లేని పెంపకాలివి. 'పిచ్చితల్లి' కథలో 'తన అందం, శారీరంకంగా తన అవసరం, తన అదృష్టం - ఈ మూడు మాత్రమే అర్థమయ్యేట్లు పెంచుతున్నాం ఆడపిల్లల్ని' అని సావిత్రి అన్న మాటలు ఆ విధమైన పెంపకపు తీరుపై విమర్శను ధ్వనిస్తాయి.

మంగళసూత్రం స్త్రీ సౌందర్యాన్ని, శరీరాన్ని, శ్రమను దోచుకొనటానికి మగవాడికి లైసెన్స్ బిళ్ళ (శ్రద్ధాంజలి) అవుతున్నట్లుగానే పురుషుడి సంపాదన మీద, సంపద మీద పడి నిర్వ్యాపరంగా బ్రతకటానికి స్త్రీకి లైసెన్సు బిళ్ళ అవుతున్నది. ఉన్నత వర్గాలలోని ఈ విధమైన స్త్రీల పరాధీనతపై శ్రామిక వర్గపు మహిళ తిరస్కారం 'స్థిత ప్రజ్ఞత' కథలో కనపడుతుంది. పనిమనిషిని, డబ్బుకు ఆమె దగ్గర చేరి పనిచేస్తున్నదని చులకనగా మాట్లాడితే 'మేమే నయం పనిచేస్తున్నాం. డబ్బులు తీసుకుంటున్నాం. నీ సంగతేమిటి? నువ్వు తాళి బొట్టు కట్టించుకుని లక్షలు అనుభవిస్తున్నావు...నువ్వేం చేస్తున్నావ్' అని ఎడాపెడా యజమానురాలిని అనవలసిన, అనదలుచుకొన్న

మాటలన్నీ అన్నది. ఆ మాటలు ఆ యజమానురాలిలో ఏ కదలికనూ తెచ్చినట్లు లేదు కానీ 'సహాయం' కథలో భర్త ఇంకొక ఆడదానితో తిరుగుతున్నాడని ద్వేషంతో ,కచ్చతో ఆ స్త్రీని డబ్బుకు అమ్ముడు పోయేది' అని చులకనగా మాట్లాడినప్పుడు 'మీరు...!?' అని సిద్ధార్థ వేసిన ప్రశ్న 'డైమెండ్స్ చెక్కిన మంగళ సూత్రాల' ద్వారా తానూ ఆ భర్త డబ్బు మీదే ఆధారపడి బ్రతుకుతున్నానన్న జ్ఞానానికి కళ్ళు తెరిపించింది జ్యోత్స్నను. అక్కడ నుంచి తనను తాను తెలుసుకొంటూ తనకు కావలసినది తెలుసుకొంటూ విముక్తి పొందింది ఆమె.

'స్థిత ప్రజ్ఞత' కథలో సుబ్బారావు ఆడవాళ్ళు తాళి కట్టించుకొని భర్త మీద ఆధారపడి జీవించటానికి మానసికంగా సిద్ధమై వుంటారని పెళ్ళి కనుక అది ఆధారపడటం అని అనుకోనరని అంటాడు. ఒక అవమానకరమైన లొంగుబాటు పెళ్ళి చాటున లోకతీరుగా ఆమోదం పొందటాన్ని అతను ప్రశ్నించాడు. తాను రమణమ్మతో కలసి జీవించటానికి నిర్ణయించుకొంటూనే నువ్వు ఇక్కడ ఖాళీగా వుండవు అని ఆమెను హెచ్చరించాడు. ఆమె పోషణ తన పాలసీ కాదని అంటాడు. నీ మీద ఆధార పడటం నాకూ అసహ్యమే అని రమణమ్మ అంటే నీకే కాదు ఎవరికైనా అది అసహ్యమనిపించాలి అంటాడు. భార్యలుగా భర్తల సంపాదనపై ఆధారపడి జీవించటం లోని వ్యక్తిత్వ రాహిత్యాన్ని, లొంగుబాటును గురించిన ఈ హెచ్చరిక స్త్రీలకు స్వస్వరూప జ్ఞానాన్ని కలిగించటానికే. భర్త చెంతన బ్రతకటం తప్ప మరొక సాంఘిక జీవితం తెలియని స్త్రీల బతుకు ఆత్మహత్యా సదృశమే.

ఆడపిల్లల పెంపకపు తీరు వాళ్ళను అధీనులుహా మారుస్తుంటే మగ పిల్లల పెంపకం తీరు వాళ్ళను అధికార అహంకార దుర్జన లక్షణాలను అలవరుచుకొని అభ్యసించేలా చేస్తున్నది. 'సహాయం'కథలో సిద్ధార్థ 'అవమానించేవారు అవమానించబడే వారే' అని చెప్పిన మాటలు గమనించదగినవి. చిన్నప్పుడు తండ్రి అధికారానికి హింసకు గురయిన కొడుకు శాడిస్టుగా తయారవుతాడు అని కూడా అంటాడతను. 'పూర్ణిమ' కథలో ఈ విషయాన్ని మరింత విస్తృతంగా చర్చించారు జలంధర. రాంబాబు పెంపకంలో లోపాలే అతణ్ణి పెళ్ళాంగా వచ్చిన పూర్ణిమపై సర్వాధికారాలు, పెత్తనాలు చలాయించేలా చేసాయి అని కథలో భాగం చేసి చెప్పారు. స్త్రీలకే కాదు పురుషులకూ ఈ కుటుంబంలో అభద్రత వుంది. స్త్రీలకు కుటుంబం, సంతానం భద్రత నిస్తాయి అనుకొంటే ఆస్తులు,ఆడవాళ్ళు తన నుండి జారిపోతాయేమోనన్న అభద్రతను అధిగమించటానికి పురుషుడు రోజురోజుకూ కర్కశుడవుతున్నాడని జలంధర ఈ కథలో చెప్పే ప్రయత్నం చేశారు. కుటుంబాలను శిథిలాలయాలుగా చెప్పి చూపిన కథలివి. తాము ఎన్ని దుఃఖ సముద్రాలను దిగమింగుకొని అయినా చిందరవందరగా వున్న కుటుంబ జీవితాన్ని చక్కదిద్దటానికి ప్రయత్నించేవాళ్ళు, తమ జీవితాల్ని తాము ఒక పద్ధతిలో తీర్చిదిద్దుకొనే వాళ్ళు అయిన స్త్రీలే చరిత్ర నిర్మాతలు అవుతారు - ఎవరికి కన్నెర్ర అయినా, ఎందరికి కడుపు మంట అయినా స్త్రీ తన మీద తాను జాలిపడే స్థితి నుండి ఎదిగి, ఇతరుల జాలిని ఆశించని ఆత్మస్థైర్యాన్ని అభివృద్ధి పరచుకొని జీవించటమే జలంధరకు అభిలషణీయం, ఆ క్రమంలో రూపొందిన పాత్రలే మైథిలి, వరూధిని.

# I V

జలంధర కథలు ఎక్కువగా సంఘటనా ప్రధానాలు. ఒక సంఘటనను కేంద్రంగా చేసుకుని జీవితాన్ని ముందు వెనుకల నుండి సమగ్రంగా, నిర్దిష్ట ప్రయోజనంతో ఆవిష్కరిస్తాయి. వస్తువుకు తగిన వాతావరణ పరికల్పన తాత్త్విక వ్యాఖ్యానాలు కథకు వెలుగునిస్తాయి. ఆ వెలుగులో మనుషుల గుండె లోతులలోని భిన్న భావోద్వగాలు,అనుభూతులు కళ్ళకు మిరుమిట్లు గొలిపేలా దర్శనమిస్తాయి. పాఠకుల లోక జ్ఞానాన్ని పెంచుతాయి. ఆద్యంతాలు ఒక బిగువుతో, ఉత్కంఠతో సాగే కథలు పాఠకుల హృదయాలను కదలించి కన్నీళ్ళు పెట్టిస్తాయి.

తల్లి మరణ సన్నివేశం చుట్టూ తిరిగే కథ 'ఊహల్లో స్వర్గం'. మరణ శయ్యపై వున్న తల్లిని గురించిన కూతురి వేదన, దుఃఖం వస్తువు. తల్లి గురించి బాధపడే కూతురి కోణం నుండి ఆ కుటుంబంలోని సంబంధాలు వ్యాఖ్యానించబడతాయి. రాయివేస్తే నిశ్చలమైన నీటిలో వలయాలు ఏర్పడినట్లు తల్లి గురించిన ఆలోచనలు, జీవితాన్ని వలయాలు వలయాలుగా ఆవిష్కరిస్తాయి ఈ కథలో. మరణానంతరం తల్లి ఏమవుతుంది ఎక్కడ వుంటుంది? అంటే స్వర్గంలో అని సమాధానం. ఇంటిని తన జీవిత కాలంలో స్వర్గం చేసిన అమ్మ మరణానంతరం చేరేదే స్వర్గానికే. మరణానంతర స్వర్గాన్ని గురించిన ఊహ నుండే ఇంటిని స్వర్గం చేసిన అమ్మ వ్యక్తిత్వం రేఖలు రేఖలుగా చిత్రితమవుతుందీ కథలో. సనాతన కుటుంబంలో పుట్టి పెరిగి, క్రిస్టియన్‌కు హిందువుకు పుట్టిన అనాథ శిశువును తెచ్చి పెంచుకున్న సంస్కారం, దానిని దాచి పెట్టకుండానే తల్లి ప్రేమను అతనికి పంచగలిగిన వ్యక్తిత్వం, తరువాత పుట్టిన పిల్లలను అన్నగా అతనిని ఆమోదించి ప్రవర్తించే విధంగా పెంచగలిగిన మానవ చైతన్యం, అనాథ బిడ్డకు ఆశ్రయ మివ్వలేని కుల ఉన్నతత్వాన్ని తిరస్కరించగలిగిన ధీరత్వం - ఇవన్నీ ఒకదాని సంబంధంలో ఒకటి ఆవిష్కరింపబడుతూ కథనంలో ఉత్కంఠను పోషిస్తాయి. అమ్మ మరణానికి చేరువవుతున్నదని దుఃఖించే చెల్లెలిని ఓదర్చే అన్నల వాత్సల్యం, ఆప్యాయత కోసం తలొగ్గే పెద్దన్నయ్యను, హక్కుల కోసం ఎవరితోనైనా నిలబడి పోరాడే చిన్నన్నయ్యను ఒకే రకంగా అభిమానించి గౌరవించగల చెల్లెలి వ్యక్తిత్వం, కర్మకాండల మీద తనకు నమ్మకం లేకపోయినా అమ్మకు అంత్యక్రియలు చేయటానికి సిద్ధమైన పెద్దన్నయ్యను కులం కానివాడని బంధువులు నిరాకరించబోతే అతని హక్కు కాపాడటానికి ఆచారానికి తలవొగ్గి స్నానం చేసి వచ్చి అన్నకు అండగా నిలబడ్డ చిన్నన్నయ్యలోని న్యాయబుద్ధి -అన్నీ అతి వేగంగా కదులుతూ ఒక మరణం కూడా మానవీయ సంబంధాలను వాగ్దానం చేయగల శక్తిమంతమైనదన్న స్ఫూర్తిని ఇస్తాయి. దుఃఖం, సంతోషం కలనేతలై జీవిత తాత్వికతను ఆవిష్కరిస్తాయి.

'సాలభంజిక', 'మజిలీ' రైలు ప్రయాణ ఘటనలు ప్రధానమైనవి. 'సాలభంజిక' కథలో అది వర్తమానం అయితే 'మజిలీ'లో గతానికి సంబంధించిన జ్ఞాపకం. ప్రయాణమంటే ఒక గమ్యం గమనం రెండూ వుంటాయి. బాధిత స్త్రీ కుటుంబంలో దాంపత్య సంబంధాలలో వంచనకు, తిరస్కృతికి గురి అయిన స్త్రీలకు గమ్యం ఏమిటో గమనక్రమంలోనే తెలుస్తుంది. 'సాలభంజిక' కథలో శారదకైనా, 'మజిలీ'లో వరూధినికి అయినా చేరవలసిన గమ్యం తమ మీద తాము జాలిపడటం మానేసి తమను తాము ప్రేమించుకొని, జీవితాన్ని ప్రేమిస్తూ ఇతరుల జీవితాన్ని వెలిగించే సంకల్పం, ఆచరణ. ఆ రకంగా ఆ రైలు ప్రయాణాలు వాళ్ళ జీవితయానాన్ని నిర్దేశించినవి.

ఒక్కొక్క సంఘటనకు జీవితంలో స్తబ్ధతను బద్దలు కొట్టే శక్తి ఉంటుంది. 'ఉప్పెన' కథలో సంఘటన అటువంటిదే. శ్రీదేవి లోపల చెలరేగిన ఉప్పెన- దానిని మరింత ఎగసనదోసే బయటి ఉప్పెన. ఉప్పెన ఉన్నవాటిని తుడిచిపెడుతుంది. కొత్తవాటిని బయట పడేస్తుంది. శ్రీదేవి లోపల ఉప్పెనకు కారణమైంది ఆమె పెళ్ళి. అంతవరకు తెలియని జీవిత వాస్తవాలకు ఆ ఉప్పెన ఆమె కళ్ళు తెరిపించింది. చదువులు, సరదాలు, హోటళ్ళు, తిండ్లు, హోదా గల పెళ్ళికొడుకు, విదేశాలలో సుఖజీవనం - వీటికి సంబంధించిన సాధారణ జీవన భావాలను మూల మట్టంగా కదిపిన ఉప్పెన అది. తనను కని పెంచిన అమ్మ గురించి తెలియటానికి ప్రారంభమూ ఆ ఉప్పెనే. మనుషుల మధ్య దూరం నుండి పుట్టిన ఉప్పెన అది. మనుషులను ఒంటరి దీవులుగా మార్చిన ఉప్పెనగా పెళ్ళి అనే వ్యవవస్థ రూపాంతరం చెందటాన్ని సూచించటానికి బాహ్యప్రకృతిలో ఉప్పెన చక్కగా ఉపయోగపడింది ఈ కథలో. ఉప్పెనలో బ్రతకలేని పరిస్థితులు ఏర్పడిన మనుషులకు సహాయంగా వెళ్ళే శంకరాలున్నారు బయటి ప్రపంచంలో. పెళ్ళి అనే ఉప్పెనలో చిక్కుకున్న ఆడపిల్లలకు ఆ అవగాహన కలుగుతుందా, కలిగినా నిలుస్తుందా, బ్రతకలేని పరిస్థితులలో బయటకు వచ్చే చైతన్యం వుందా? సహాయ హస్తం అందించే శంకరాలుంటారా ? - మొదలైన ఎన్నో ప్రశ్నల జడివాన ఈ ఉప్పెన కథ.

'శ్రద్ధాంజలి', 'ముంగిట్లో ముత్యాలు' రెండు కథలు కదిల్చి కన్నీళ్ళు పెట్టిస్తాయి. రెండిట్లోనూ ఇతివృత్తం దుఃఖోః ద్వేగాలను, భావోద్వేగాలను మోసుకొచ్చేదే. అయితే 'శ్రద్ధాంజలి' కథ దానికి మూలమైన జీవిత బీభత్సాన్ని చిత్రిస్తే, 'ముంగిట్లో ముత్యాలు' దానికి మూలమైన స్నేహరాగ జీవన లాలసలను చిత్రించింది. శ్రద్ధాంజలి చనిపోయినవాళ్ళకు చేసే గౌరవ నమస్కారం. 'శ్రద్ధాంజలి' కథలో చనిపోయిన చుక్కమ్మ ఉంది. 'చచ్చిపోవాలంటే బయ్యం' అని బ్రతికేస్తున్న లక్ష్మి ఉంది. చుక్కమ్మ లాంటి వాళ్ళ ఆత్మహత్యలకు కారణమైన మొగుడి భోగలాలస లక్షణం తెలిసి, అతన్నేమీ అనలేక, ఎదిరించి బ్రతకలేక జీవన్మృతురాలుగా పడివున్న పెద్ది రెడ్డి భార్య వున్నది. చనిపోయిన అక్క పేరు మీద ముత్తయిదుకు పెట్టుకుంటే అక్క ఆత్మకు శాంతి అని బిందెలతో నీళ్ళు మోసి సంపాదించిన డబ్బుతో చీర పసుపు కుంకుమలు కొన్న లక్ష్మి, పెద్దిరెడ్డి చేసిన అన్యాయానికి పరిహారమా అన్నట్లు ఆ వాయినం తాను తీసుకొనటానికి సిద్ధపడిన పెద్దరెడ్డి భార్యకు వాయినం ఇచ్చింది. ఇంతవరకు ఈ కథ ఒక ఎత్తు. ఆ వాయినం తీసుకొని తాను చనిపోయాక తన పేరు మీద ముత్తయిదువకు పెట్టమని లక్ష్మిని కోరటం మరొక ఎత్తు. కుటుంబాలు స్త్రీలకు మిగులుస్తున్నఅసంతృప్తిని, ఆవేదనను మొహం మీద కొట్టినట్లు చూపించిన ఈ కథ స్త్రీల జీవితంలో బ్రతుకుకు చావుకు మధ్యవున్న సన్నని రేఖను సూచించింది. 'శ్రద్ధాంజలి' కథలో విషాద భావోద్వేగాలు పాఠకులను అలజడికి లోను చేస్తాయి.

ముంగిట్లో ముత్యాలు శుభానికి, సౌందర్యానికి, స్వచ్ఛతకు ప్రతీకలు. నాగరికత చదువు సంధ్యలు, ఉద్యోగాలు, సంపాదనలు, సంపదలు, వస్తు సంచయం ఇవే మానవ జీవన సౌఖ్యానికి మూలం అనుకొనటం వలన కోల్పోతున్న జీవన మాధుర్యం ఎంతో ఉంది. పల్లెటూరి జీవనంలో ఇమడలేక కాపురాన్ని వదిలి చదువుకొని అంచెలంచెలుగా ఎదిగి అమెరికాలో ప్రపంచ బ్యాంకు ఉద్యోగస్థాయికి ఎదిగిన స్త్రీకి ఆ జీనవ మాధుర్యం గురించిన స్పృహ కలగటంతో ప్రారంభమవుతుంది ఈ కథ. ఆ స్పృహ కారణంగానే స్వదేశానికి వెళ్ళున్న కొడుకు కోడళ్ళతో తన వూరు చూచి రమ్మంటుంది. ఇక అక్కడినుండి అత్తగారి వియోగ విషాద భావోద్వేగాల పట్ల సానుభూతితో అత్త తిరిగిన ఊళ్ళో తిరిగి అత్త బంధువుల నోట అత్త గురించి విని, అత్తను ప్రేమించి లాలాంచి

అత్తను ఇంకా తనది గానే దేవుడి గదిలో ప్రతిష్ఠాపించుకొని భావిస్తున్న మామగారిలోని మహోన్నతత్వానికి కదిలిపోయి కోడలు పొందిన సహానుభూతితో పాఠకులు మమేకమవుతారు. మనుషుల సంబంధాలకు, జ్ఞాపకాలకు, చిన్నచిన్న సంతోషాలకు, సంతృప్తులకు మనుషులను మళ్ళీ ట్యూన్ చేయగలిగిన సజీవ మానవ రసహృదయావిష్కరణ ఈకథను గొప్ప కథగా చేసింది.

పాత్రలను ప్రవృత్తులలోని,ప్రవర్తనలోని వెలుగునీడలతో సహా చిత్రించే నేర్పు జలంధరది. సంస్కారవంతులయిన మనుషుల సన్నిధిలో సాధారణ జనం తమను తాము ప్రక్షాళన చేసుకొనే చైతన్యాన్ని పొందుతారు అన్న విషయాన్ని 'స్థితప్రజ్ఞత' కథలో రమణమ్మ పాత్రలో చూపించారు. బ్రతుకు తెరువుకై ఫాక్టరీలో కూలిపనికి చేరి అయ్యగారి వంచనకు గురై సుబ్బారావు ఆదరణ పొందిన రమణమ్మ, సుబ్బారావులో అతి సహజంగా వ్యక్తమైన మానవీయ ఔన్నత్యాన్ని చూచి అబ్బురపడుతుంది. ఫాక్టరీలో అతన్ని చూస్తూనే వున్నా సూటూ, బూటూ , కారు, కళ్ళజోడు వున్న అయ్యగారి ముందు తనకెవరూ కనిపించేవారు కాదు అనుకొంటుంది. తన ప్రవర్తనలోని ఈ లొసుగు తనకే స్ఫురించేసరికి తెలియకుండానే తన కళ్ళు అయ్యగారికి ఆహ్వానం పలికాయా అన్న సందేహం కూడా కలిగించేదామెకు. పాత్రను అంతరాంతరాల నుండి చిత్రించటమిది. పాత్ర చిత్రణ అంటే రూప చిత్రణ, స్వభావ చిత్రణ మాత్రమే కాదు మనస్తత్వంలోని వైచిత్రి సంస్కారాల చిత్రణ. సంఘర్షణ చిత్రణ కూడా. అంతరాత్మ ముందు ఏ ముసుగులు, ఆత్మవంచనలు లేకుండా మనిషి తనను తాను ఆవిష్కరించుకునే ఆ అరుదైన క్షణాలను పట్టుకొనగలగటం, పాత్ర చిత్రణలో సాధించవలసిన లక్షణం. జలంధర దానిని సాధించారు.

సాధారణంగా జలంధర కథలలో సంఘర్షణ అంతా ఆడవాళ్ళదే. ఆ సంఘర్షణలో వాళ్ళొక సమన్వయాన్ని సాధించటానికి మేధావులుగా దిశానిర్దేశం చేసిన వాళ్ళు మాత్రం ఎక్కువగా మగవాళ్ళు.

స్త్రీగా సహజంగా అభివృద్ధి చేసుకొనటానికి వీలైన స్త్రీ దృష్టి కోణం జలంధర కథలకు బలం చేకూర్చిన అంశం. స్త్రీల జీవిత వాస్తవాలను అందువల్లనే ఆమె కథలలో భాగం చేయగలిగారు. స్త్రీల జీవితాన్ని భిన్న పార్శ్వాల నుండి వ్యాఖ్యానించి చూపగలిగారు. స్త్రీల జీవిత అంతరంగ కల్లోలాలను, చిత్రించగలిగారు. అవి ఆమె విస్తృత జీవితానుభవాన్ని, సాహిత్య తాత్త్విక అవగాహనను ప్రతిఫలిస్తాయి.

స్త్రీ ఒక మానవ వ్యక్తిగా గుర్తింపబడాలనేది జలంధర ఆకాంక్ష. అది ఆమె స్త్రీల పాత్రల ఆకాంక్ష కూడా. దానిని సాధించటం కోసం ఎవరి యుద్ధానికి వాళ్ళే సిద్ధపడినందు వలన జలంధర కథలలో స్త్రీల పాత్రలు వైవిధ్య భరితంగా వుంటాయి. స్త్రీని పురుషుడు అర్థం చేసుకొనే కోణం అతని అవసరాలకు లోబడి వుంటుందని జలంధర అభిప్రాయం, వేరు వేరు స్థాయీ సంబంధాలలో ఉన్న స్త్రీల మధ్య సంబంధాలను వైరుధ్యాలను అనేక కథలలో చిత్రించిన జలంధర అంతిమంగా ఆ వైరుధ్యాలను అధిగమించ గలిగిన కొత్త చైతన్యంతో స్త్రీలు ఎదగటాన్ని ఆశించారు.

back to book of the week home page

❖ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ కృష్ణ -జనని కొచ్చెర్లకోట (న్యూజెర్సీ-యు.ఎస్.ఎ) వదాన్య సౌజన్యంతో అందించబడింది.